క్లుప్తంగా

డప్పు కళా బృందానికి మంత్రి అభినందన



షీల్డ్ అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

గరిడేపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో గరిడేపల్లికి చెందిన సతీష్ డప్పు కళాబృందం నిర్వహించిన ప్రదర్శన అందరిని అకట్టుకుంది. ఈ సందర్భంగా డప్పు కళాబృందాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు అమరవరపు సతీష్, లావణ్య, నాగలక్ష్మి, మార్త, అనిత, జ్యోతి, నాగలక్ష్మి, సుజాత, స్వరూప, అనురాధ, రోష్ణి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



వెంకన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని పాత నేరేడుచర్లకు చెందిన టైలర్ డికొండ వెంకన్న అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం మున్సిపల్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి మంగళవారం రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మార్కెండేయ, సైదులు, పోరెడ్డి శ్రీరాంరెడ్డి, పుల్లారావు, బషీర్, లతీఫ్, శ్రీనివాసాచారి, నరేష్, సైదా, సైదిరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆర్టీసీ కోదాడ డీపో మేనేజర్ శ్రీహర్ష మంగళవారం దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కోసం ప్రభుత్వం అందించే బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 30 మంది దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, బస్‌పాస్ ఇన్‌చార్జ్ అబ్దుల్ రహీం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠపనోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని కొనాయిగూడెం గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ, అంకమ్మ, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాళ్లబండి రాజశేఖర్‌శర్మ, భద్రయ్యశర్మ, ఉపేందర్ శర్మ, జ్ఞానసాయి మోహన్‌శర్మలు వేద మంత్రోత్సవాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యావచనం, నవకలశ స్నానం, గ్రామంలో ప్రభాత సేవ తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు తదితరులున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి అన్నారు. మంగళవారం పట్టణంలోని 24వ వార్డులో రూ.4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు కౌన్సిలర్ గుంజ భవానితో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వై.గురవయ్య నాయకులు యడ్ల విజయ్, డి.నవీన్‌రెడ్డి, లతీఫ్, వెంకన్న, గోపయ్య, రమేష్, పుష్ప, సంధ్య, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణాల పేదలకూ రూ.లక్ష ఆర్థికసాయం ఇవ్వాలి

నేరేడుచర్ల : అగ్రవర్ణాల పేదలకూ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో నిరుపేదలు ఉన్నట్లుగానే అగ్రవర్ణాల కుటుంబంలో కూడా పేదలు ఉన్నారన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికి కులమతాలతో సంబంధం లేకుండా రుణ సదుపాయం కల్పించాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సీపీఐ కార్యదర్శులు కత్తి శ్రీనివాస్‌రెడ్డి, సింహాద్రి, చిలకరాజు శ్రీను, శ్రీరాములు, శివారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



కోదాడలో మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, అధికారులు, మహిళలు



హుజూర్‌నగర్ : గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి సతీమణి రజిత, మహిళా అధికారులు

కోదాడఅర్బన్ : రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కోదాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాలు మహిళలను వంటింటికే పరిమితం చేశాయని, ప్రస్తుతం సీఎం కేసీఆర్ వారి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటంతో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని అన్నారు. పుట్టిన బిడ్డ ఇంటికి చేరే వరకు, పేదింటి ఆడకూతురు పెళ్లిలకు అనేక పథకాలు అమలు చేస్తూ అండగా నిలుస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. కరోనా కాలంలో ఆశా కార్యకర్తలు పారిశుద్ధ్య సిబ్బంది, ఆరోగ్య శాఖ మహిళా ఉద్యోగులు చేసిన కృషి ప్రశంసనీయమైనదన్నారు. ప్రజారోగ్యంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా ఉందన్నారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులను, ఉద్యోగులు, ఉత్తమ మహిళలను ఘనంగా సత్కరించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, డాక్టర్ ప్రమీలాశ్రీపతిరెడ్డి, శ్రీదేవి, కౌన్సిలర్లు పద్మజ, లలిత, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ఏపీఎంలు, మహిళా నాయకులు దేవమని, రోజారమణి, సైదాబీ, భాగ్యమ్మ, సత్యవతి, పార్వతి, సర్పంచ్‌లు లీలావతి, బుజ్జి, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు లేకుంటే సృష్టి లేదు : ఎమ్మెల్యే

హుజూర్‌నగర్ : దేశంలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం హుజూర్‌నగర్‌లో మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సైదిరెడ్డి, రజిత దంపతులకు మహిళలు బతుకమ్మలు, కోలాటాలతో స్వాగతం పలికారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన పౌష్టిక ఆహార పదార్థాలను, ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. చేతివృత్తుల కులాలకు చెందిన లబ్ధిదారులకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించిన స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థిని వైష్ణవి దేవి, విద్యార్థిని లక్ష్మీలను శాలువాతో సన్మానించారు. వివిధ శాఖలలో ప్రతిభ చాటిన మహిళా అధికారులను, ప్రజాప్రతినిధులను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు లేకుంటే సృష్టి లేదన్నారు. అన్నిట్లో సగమై, విశ్వ చైతన్య మూర్తిగా మహిళలు నిలుస్తున్నారని కొనియాడారు. తెలంగాణ రాకముందు మహిళలు వెట్టి చాకిరి చేస్తూ దుర్భర జీవితాలు గడిపారని అన్నారు. తెలంగాణ ఆవిర్భవించాక సీఎం కేసీఆర్ మహిళలకు చెప్పుకోదగిన వేతనాలను అందించి ఆత్మవిశ్వాసంతో జీవించే విధంగా చేశారని చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన, వైస్ చైర్ పర్సన్ చల్ల శ్రీలత, ఎంపీపీ ఎం.పార్వతి, ఎల్.జ్యోతి, వైద్యాధికారి సాహితి, తహసీల్దార్లు జయశ్రీ, శ్రీదేవి, సరిత, ఎంపీడీఓ శాంతకుమారి, ఇన్‌చార్జ్ సీడీపీఓ హేమాదేవి, మహిళా అధికారులు, కౌన్సిలర్లు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కోదాడఅర్బన్ : మహిళా ఉద్యోగినిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



హుజూర్‌నగర్ : మహిళా సంక్షేమ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

తెలంగాణలో ఆలయాలకు పూర్వవైభవం



కలకోవలో దేవాలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మునగాల : తెలంగాణలో ఆలయాలకు పూర్వవైభవం వస్తున్నదని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండలంలోని కలకోవ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్రంలో సనాతన హిందూ ధర్మరక్ష పరిరక్షణ కోసం సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 4.805 ఆలయాలలో దూపదీప, నైవేద్య అర్చకులకు ప్రభుత్వం ప్రతి దేవాలయానికి రూ.ఆరు వేల చొప్పున గౌరవ వేతనం చెల్లించి ఆదుకుంటుందన్నారు. దీనిలో రూ.2 వేలు నిత్య పూజల కోసం, రూ.4 వేలు అర్చకుల కోసం కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, సర్పంచ్ కొంపెల్లి సుజాత, ఎంపీటీసీ గన్నా భవాని, ఉపసర్పంచ్ బెల్లంకొండ చిన వెంకన్న, మండల నాయకులు నల్లపాటి శ్రీనివాసరావు, కందిబండ సత్యనారాయణ, ఎలక నరేందర్ రెడ్డి, సీతారాములు, కొంపెల్లి వీరబాబు, గన్నా నరసింహారావు, ఆలయ కమిటీ చైర్మన్ గుర్వయ్య, వీరయ్య, విజయలక్ష్మి, పాలకవర్గం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు 'డబుల్ ఇళ్లు' మంజూరు చేయాలి



నిరాహార దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న పిల్లుట్ల శ్రీనివాస్

మోతె : అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని బహుజన సమాజ్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లుట్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు మంగళవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సామ వెంకటరెడ్డి, దోసపాటి చిరంజీవి, సర్పంచ్ నాగునాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, పాల్గొన్నారు.

గౌడ కులస్తులు అభివృద్ధి చెందాలి

- కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్



కంఠమహేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పల్లె రవికుమార్‌గౌడ్, తదితరులు

కోదాడరూరల్ : సూరమాంబ సమేత కంఠమహేశ్వర స్వామి ఆశీస్సులతో గౌడ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రవరంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు కలిసికట్టుగా ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కల్లుగీత వృత్తి నిర్లక్ష్యానికి గురైందని తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు ప్రసాద్, మల్సూర్‌గౌడ్, కెఎల్ఎన్ ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంపెట ఉపేందర్‌గౌడ్, పెండెం శ్రీనివాస్‌గౌడ్, బెల్లంకొండ నాగేశ్వరరావుగౌడ్, బూర శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్, తారకరామ్‌గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకు అండగా ఉంటాం

కోదాడరూరల్ : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గాయాలపాలైన, మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. ఇటీవల మండల పరిధిలోని తొగర్రాయిలో తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన వట్టికూటి శ్రీనివాస్ కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించి, కార్పొరేషన్ నుంచి తక్షణ సహాయం కింద మంజూరైన రూ.25 వేల చెక్కును అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు కెఎల్ఎన్ ప్రసాద్, మధుగౌడ్, లింగంగౌడ్, వేలాద్రి ఉన్నారు.

బడిఈడు పిల్లలను బడికి పంపాలి



గరిడేపల్లి : ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నడిగూడెం : బడిఈడు పిల్లలను బడికి పంపాలని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో బడి బాట నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సామినేని శ్రీనివాసరావు, డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, బత్తిని శ్రీనివాసరావు, మేరాజుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

గరిడేపల్లి : నాణ్యమైన విద్య కోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్యపుస్తకాలను అందజేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డు హెచ్‌ఎం మృతికి పలువురి సంతాపం

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు గడ్డమీది మల్లయ్య (75) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. మంగళవారం మండలంలోని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డు ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఎండీ.ఖలీల్, డి.అంజయ్య, వెంకటేశ్వరరావు, గుండు అనంతరాములు, తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యంపై ఆందోళన



నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఎస్పీ నాయకులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చేతివృత్తులవారికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో జాప్యంపై బీఎస్పీ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ మాట్లాడుతూ కులవృత్తిదారులు ప్రభుత్వం అందించే ఆర్థికసాయం కోసం ధ్రువీకరణ పత్రాలు కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సర్టిఫికేట్లు జారీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు కర్రి సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తక్కెళ్ల నాగార్జున, వెంకటేశ్వర్లు, బాబు తదితరులు ఉన్నారు.

రాజన్న రాజ్యం షర్మిలతోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు జేవీఆర్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : తెలంగాణలో రాజన్న రాజ్యం వైఎస్సార్ టీపీ అధినేత వైఎస్ షర్మిలమ్మతోనే సాధ్యమని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) అన్నారు. చింతలపాలెంకు చెందిన పలువురు మంగళవారం జేవీఆర్ సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ పాలనలో ప్రజలు ఏ లోటు లేకుండా హాయిగా బతికారని చెప్పారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. సామాన్య ప్రజల వాహనాలకు చలాన్లు వేసి వసూలు చేయకుంటే జీతాలు చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ఎమ్మెల్యేలు రౌడీయిజం, గుండాయిజం చేస్తున్నారని ఆ పార్టీ నాయకులే అసెంబ్లీ వేదికగా చర్చించుకుంటున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఒకటేనని సీసాలు వేరైనా సారా అంతా ఒకటేనని ఎద్దేవా చేశారు. ముందుగా గ్రామంలో ఆయనకు స్వాగతం పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్‌టీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మర్రి యశోదారెడ్డి, జిల్లా యువజన కార్యదర్శి రామిశెట్టి మురళి ప్రసాద్, హుజూర్‌నగర్ మండల అధ్యక్షుడు మర్రి రవీందర్‌రెడ్డి, నాయకులు గురవారావు, ఇమామ్, అన్వర్, సైదా, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నాగేశ్వర్‌రావు



నియామకపత్రం అందజేస్తున్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్

నేరేడుచర్ల : జన సేన పార్టీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నేరేడుచర్లకు చెందిన తరికొప్పుల నాగేశ్వర్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం నాగేశ్వర్‌రావుకు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జ్ శంకర్ గౌడ్, నాయకులు రాము, సతీష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు

గరిడేపల్లి : మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం గరిడేపల్లిలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గానుగుబండ, సర్వారం, అబ్బిరెడ్డి గూడెం, లక్ష్మీపురం, కల్మలచెరువు, వెలిదండ, రంగాపురం లాంటి మారుమూల గ్రామాలకు ఉమ్మడి రాష్ట్రంలో బస్సు సౌకర్యం ఉండేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆయా గ్రామాలకు బస్సు సదుపాయం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచన చేసి అన్ని గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లకుమళ్ల జ్యోతి

నేరేడుచర్ల : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని, పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగు పరచాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీడీఓ శంకరయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు

మునగాల : మండలంలోని ముకుందాపురంలో బుధవారం బొడ్రాయిలు (నాభిశిలలు), శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహణ కమిటీ తెలిపింది. జాతీయ రహదారి పక్కన సుమారు రూ.రెండు కోట్ల వ్యయంతో నిర్మించిన దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ, పాత ముకుందాపురం, కొత్త ముకుందాపురం గ్రామాలలో బొడ్రాయిలు ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లను చేసింది. ఇందులో భాగంగా మంగళవారం శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు, జలాభిషేకం నిర్వహించారు. బుధవారం ఉదయం 7 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుంది. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల దృష్ట్యా గ్రామంలో ఈనెల 11 నుంచి 28 వరకు గ్రామప్రజలు మద్యపానం, మాంసాహారం తీసుకోకూడదని నిర్ణయించినట్లు కమిటీ తెలిపింది. ఉత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

బస్సుయాత్ర కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పద్మావతి, తదితరులు

కోదాడరూరల్ : రాష్ట్రంలో ఇళ్లు, ఇంటి స్థలాలు లేని పేదలకు ఇంటి స్థలాలను కేటాయించాలని కోరుతూ తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వెలిది పద్మావతి కోరారు. మంగళవారం మండలంలోని కాపుగల్లులో బస్సు యాత్ర కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించుకున్న అర్హులైన వారందరికీ 125 గజాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల పథకాన్ని వారికి వర్తింపజేయాలన్నారు. ఈ నెల 18న కాపుగల్లుకు బస్సుయాత్ర చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో గుడిసెవాసులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి సింధూరాభిషేకం



ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తెల్లవారుజాము నుంచే పంచామృతాభిషేకాలు, సింధూరాభిషేకం, ఆకు పూజ, పుష్పాలంకరణ అనంతరం మహార్నివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజయ్య, తిరుపతయ్య, అన్నదాన నిర్వాహకుడు దేవరశెట్టి హనుమంతరావు, దాతలు ఓరుగంటి భాను ప్రకాష్, మౌనిక, కొత్తూరు పూర్ణచందర్‌రావు, రాధ, గెల్లా సాయి, లక్ష్మీనారాయణ, కృష్ణకుమారి, వీరేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పంచామృతాలతో సంప్రోక్షణ

గరిడేపల్లి : మండలంలోని రామచంద్రాపురంలో శ్రీకనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, మద్దిరావమ్మ, పోతరాజు, అంకమ్మ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రామచంద్రాపురం, మల్లయ్యగూడెం గ్రామాల ప్రజలు విగ్రహాలకు జల బిందెలతో అభిషేకం నిర్వహించారు. పంచామృతాలతో సంప్రోక్షణ చేశారు. వేద పండితుల వేదమంత్రోత్సవాల మధ్య హోమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

16న సర్వసభ్య సమావేశం

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16న (శుక్రవారం) ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శాంతకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 15న గురువారం నిర్వహించబోయే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

బియ్యం అందజేత

హుజూర్‌నగర్ : మఠంపల్లి మండలం పెదవీడుకు చెందిన పి.నరసింహారావు, రేవతిల కుమారుడు జీవన్ పుట్టినరోజు సందర్భంగా ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మూడు మదర్సాలకు 25 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. సొసైటీ సభ్యులు సులువ శ్రీను, షేక్ అబ్దుల్, మజీద్, దస్తగిరి, వల్లపుదాసు కృష్ణ, ఎం.సంతోష్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుకు సన్మానం

హుజూర్‌నగర్ : పద్మశాలి సంఘం జిల్లా కన్వీనర్‌గా ఎంపికైన హుజూర్‌నగర్‌కు చెందిన బొడ్డు గోవిందరావును మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని బీసీ భవన్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ధూళిపాల శ్రీని వాస్, జి.అంజియాదవ్, జి.దీప, నరసింహాచారి, అర్చన దేవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాగరాజు, సంజీవరావు, శేఖర్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠ పూజలు

నడిగూడెం : మండల పరిధిలోని ఎకలాస్‌ఖాన్‌పేటలో బొడ్రాయి ప్రతిష్ఠ పూజలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాత కాల పూజ, విశేష పారాయణములు, జపములు, హోమం నిర్వహించారు. అలాగే జలాధివాసము, పూజలు నిర్వహించారు. బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

కోదాడఅర్బన్ : కోదాడ తపాలా కార్యాలయంలో పునఃప్రారంభించిన ఆధార్ నమోదు కేంద్రాన్ని స్థానిక, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హుజూర్‌నగర్ పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కోరారు. మంగళవారం స్థానిక ఉప తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ పోస్టుమాస్టర్ జి.రవి, తపాలా సిబ్బంది జి.లలిత, డి.శ్యాంసన్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగ మృతి పార్టీకి తీరని లోటు

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన సీపీఐ నాయకుడు గుండా శ్రీరంగ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లవుల రాములు అన్నారు. అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన శ్రీరంగం మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు కంబాల శ్రీనివాస్, వెంకన్న, సురేందర్, రమణ, వెంకటేశ్వర్లు, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీతవారిగూడెంలో వైద్య శిబిరం

గరిడేపల్లి : ఉచిత వైద్య శిబిరాన్ని లేబర్ కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కీత జ్యోతిరామారావు కోరారు. మంగళవారం మండలంలోని కీతవారిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సీఎస్‌సీ హెల్త్ క్యాంప్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం సీఎస్‌సీ హెల్త్ క్యాంప్ జిల్లా కోఆర్డినేటర్ రమావత్ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ 110 మంది కార్మికులకు ఉచితంగా 50 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, నజీర్‌ఖాన్, కార్మిక నాయకులు సుంకరి మోహన్‌రావు, కార్యదర్శి ధనమూర్తి, కార్మికులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.